అవును ఆయన ఆలోచనలు విభిన్నం.. ఆయన ఆచరణ వైవిధ్యం.. బాల్యంలోనే తాను రైతు కుటుంబాలకు అండగా నిలవాలని తొలి అడుగులు వేసినా.. కౌమారంలో నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నా.. విద్యార్థి ఉద్యమాల పోరుగడ్డ ఉస్మానియాలో ఉన్నత చదువులు పూర్తిచేసి.. నూనూగు మీసాల వయసులో ప్రభుత్వ ఉద్యోగం చేసి అనేక మందికి నిస్వార్థమైన సేవ చేయాలని కన్న కలలను నిజం చేసుకున్నా.. ఆయనకే చెల్లింది. రెవెన్యూ ఉద్యోగులకు పెద్దన్నగా ఉంటూ.. అన్నదాతలకు సంక్షేమం అందాలన్న పవిత్ర ఆశయంతో రైతు సేవా ఫౌండేషన్‌ను స్థాపించి.. రెవెన్యూ వ్యవస్థలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భూ భారతి చట్టం లాంటి ఎన్నో ఆవిష్కరణలకు ఆధ్యుడిగా, యావత్ తెలంగాణ ఉద్యోగులకు మార్గదర్శిలా ఉంటూ ఉద్యోగుల, పెన్షనర్లతో జేజేలు అందుకుంటున్నారు. ఆయనెవరో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. అవును మీ మదిలో ఆలోచిస్తున్న వ్యక్తే.. ఆయనే **తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి.** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లోని చారిత్రక ప్రదేశాలలో రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహించుకుంటూ ఏప్రిల్ 3వ తేదీన మహబూబ్‌నగర్ గడ్డపై ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. కొందరు పాలకుల దాష్టీకానికి ఎదురొడ్డి నిలిచి తన మాతృసంస్థ ఉద్యోగులకోసం ఏకంగా ఉద్యోగాన్నే త్యాగం చేసేందుకు సిద్ధపడిన విలువైన సిద్ధాంత గ్రంథం లచ్చిరెడ్డి. తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఉద్యమ ప్రస్థానంపై కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...

వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి



# లక్ష్యం విసిరిన బాణం లచ్చిరెడ్డి

## ఆయన జీవితం విలువైన 'రెవెన్యూ' పాఠం

- తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా అలుపెరగని ప్రస్థానం
- తన మాతృసంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగాన్నే త్యాగం చేసిన ధీశాలి
- కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొన్న మార్గదర్శి
- పాలకుల దాష్టీకాలకు ధీటుగా నిలిచి ఫీనిక్స్ పక్షిలా పైకెదిగిన అపరచాణక్యుడు
- నేడు యావత్ తెలంగాణలోని ఉద్యోగులను ఐక్యం చేస్తూ ఆత్మీయ సమ్మేళనాలు
- ఇప్పటికే నాలుగు ఉమ్మడి జిల్లాలో సమావేశాలు గ్రాండ్ సక్సెస్

## ఫీనిక్స్ పక్షిలా పైకెదిగిన లచ్చన్న



**ఆదర్శంలో విలువల పాఠం వి.లచ్చిరెడ్డి...**

'నేనెరిగిన చాలా మందిలో ఏకాగ్రతతో కృషి చేసిన వారే విజయాలను అందుకున్నారు.. ఏకాగ్రత అంటే తాము సాధించాలని అనుకున్న ముఖ్యమైన అంశంపై దృష్టిపెట్టి కృషి చెయ్యడం..' అని వారెన్ బఫెట్ చెప్పినట్టుగా ఉమ్మడి నలగొండ జిల్లాలోని మఠంపల్లి మండలం బక్కమంతులగూడెం అనే చిన్న మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన లచ్చిరెడ్డి తను తన మాతృసంస్థ రెవెన్యూలోని అనేక మంది ఉద్యోగుల హక్కుల కోసం ప్రభుత్వ పెద్దలను ఎదురించి అనేక కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఒకానొక దశలో ఏకంగా కష్టపడి చదివి సాధించిన ఉన్నతమైన ఉద్యోగాన్ని సైతం వదిలేందుకు సిద్ధపడిన రెవెన్యూ దిగ్గజం. కానీ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను సాధించాలనుకున్న లక్ష్యాన్ని కష్టాలను చిరునవ్వుతో దిగమింగి నేడు ప్రజా ప్రభుత్వ పెద్దల అండదండలతో రైతులకు, యావత్ తెలంగాణ ఉద్యోగులకు



పెద్దన్నగా గుర్తింపు పొందాడు. అల్లారు ముద్దుగా గావురంగా పెంచుకున్న తన ఆశల సౌధంలాంటి కుమారుడిపై నాటి పాలకులు పెడుతున్న ఇబ్బందులను సహించలేక, మనో వేధనతో లోలోన రగిలిపోయిన ఆయన మాతృమూర్తి లక్ష్మమ్మ తన కుమారుడు ఉద్యోగానికి దూరం అయిన రోజు రాత్రే గుండె పగిలిపోయేలా మౌనంగా రోధించి అదే రోజున లచ్చిరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ హార్ట్ ఎటాక్‌తో తనువు చాలించారు. ఒక పక్క తన ఉద్యోగుల సమస్యల కోసం ఉన్నతమైన ఉద్యోగం త్యాగం చేసిన రోజునే అమ్మను కోల్పోయి పుట్టెడు దు:ఖంలోనూ లచ్చన్న ఆత్మస్తైర్యం కోల్పోలేదు. దు:ఖాన్ని దిగమింగి తన మదిలోని అసలైన లక్ష్యం వైపు ఆలోచన చేసి ఎట్టకేలకు విజయం సాధించారు.

**అనతి కాలంలోనే అనేక విజయాలు సొంతం...**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో మళ్లీ బాధ్యతల్లోకి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా  అనతి కాలంలోనే సర్కారు అండతో అనేక సంక్షేమాలను అందించారు. ప్రధానంగా భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో పాటు భూ భారతి చట్టం-2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని సుమారు 70లక్షల మంది రైతులకు క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు సేవలందించేందుకు




10,954 మంది గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేయించుకున్నారు. పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను మళ్లీ మాతృసంస్థలోకి తీసుకొచ్చారు. తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల ఏర్పాటు, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు కొల్పోయిన అధికారాలను  భూభారతి చట్టంతో పునరుద్ధరించుకున్నారు. అందుకు గాను లచ్చిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. జీఓ నం.317తో రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిన నేపథ్యంలో ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా స్పౌజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం బదిలీలను చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాలలో పోస్టుల మంజూరు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లు వరకు పదోన్నతులు సాధించడం, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు గతంలో కొల్పోయిన అధికారాలను  భూభారతి చట్టం-2025తో పునరుద్ధరణ, పూర్వ వీఆర్ఏలు వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన వారిని తిరిగి వారి సొంత జిల్లాకు తీసుకురావడం తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ సాధించిన విజయాలు. 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా నియాకం చేయడం, 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ యాజమాన్యం నుండి ప్రభుత్వ కార్పొరేషన్‌కు బదిలీ చేయడం ప్రస్తుత ప్రజాప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేసేలా లచ్చిరెడ్డి ప్రభుత్వ పెద్దలతో ఒప్పించారని ఆయన సహచర ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి పాటు డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, గ్రామ పాలన ఆఫీసర్ల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు,తదితరులతో కలిసి తెలంగాణ గడ్డపై జేఏసీ వేగంగా పనిచేసేలా కృషి చేస్తున్నారు.



## ఫీనిక్స్ పక్షిలా పైకెదిగిన లచ్చన్న

స్వతహాగా సాధారణ రైతు కుంటుంబం నుండే వచ్చిన లచ్చిరెడ్డి తాను ఊహ తెలిసిన నాటినుండే రైతులకు మేలు చేయాలన్న ఆశయాన్ని దృఢంగా కలిగి ఉన్నాడు. అందుకే 'భూ సమస్యలు లేని గ్రామాలే ఆయన ప్రధాన లక్ష్యంగా..' ఎన్నో రకాల భూ సమస్యలపై అధ్యయనాలు చేశారు. తొలుత తన లక్ష్యం అమలు చేసేందుకు గాను 'రైతు సేవా ఫౌండేషన్..' మారు మూల పల్లెల్లోని కర్షకులను కలుస్తూ వారిలో చైతన్యం రగిలించారు. ప్రధానంగా పాలకుల ద్వంద నీతిని ప్రజలకు, రైతులకు వివరించి చెప్పడంతో పాలకులు కక్ష కట్టి ఆయనను అనేక ఇబ్బందులకు గురిచేశారు. రాష్ట్ర రాజధాని కేంద్రంలో ఎన్నో రకాల ప్రభుత్వ పథకాలకు మార్గదర్శిగా ఉన్న ఉత్తమ అధికారిని ఏకంగా రాష్ట్రాల సరిహద్దులకు బదిలీ చేసి మానసికంగా హింసకు గురిచేశారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా తను ఎంచుకున్న ఉద్యోగుల సంక్షేమం, రైతుల ప్రయోజనం కోసమే విధులకు దూరంగా ఉన్న నాలుగున్నర ఏండ్ల పల్లెల్లోని రైతులను, ప్రజలను కలిసి వారిలో చైతన్యాన్ని రగిలించారు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడం, రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకి రావడంతో మళ్లీ లచ్చిరెడ్డి నిస్వార్థమైన సేవలను గుర్తించింది. ప్రస్తుతం యావత్ తెలంగాణ ఉమ్మడి జిల్లాల్లో రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ జైత్రయాత్ర కొనసాగిస్తున్నారు.














**(అమ్మా నాన్న చెక్కిన శిల్పం.. ఉస్తేల లచ్చిరెడ్డి.. మరుసటి కథనం.. కెరటం న్యూస్ డిజిటల్ దినపత్రికలో..)**